
సాక్షి
పల్నాడు
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



రూ. 26 వేల వరకు మిర్చి ధర

కొరిటెపాడు(గుంటూరు): సోమవారం మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం ధర రూ.8వేల నుంచి రూ.26వేల వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 549.60 అడుగుల వద్ద ఉంది. ఔట్‌ఫ్లోగా 21,849 క్యూసెక్కులు విడుదలవుతోంది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదని వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

అమరావతిలో ఇజ్రాయేల్ యాత్రికుల సందడి



అమరావతి: ప్రపంచ పర్యాటక కేంద్రమైన అమరావతిని ఇజ్రాయేల్ దేశానికి చెందిన యాత్రికుల బృందం పురావస్తు శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. కొత్తమ్యూజియంలోని బుద్ధుని జీవిత విశేషాలను తెలిపే శిల్పాలను, పాతమ్యూజియంలోని అమరావతి స్తూపం, ధ్యానబుద్ధ ప్రాజెక్టులోని 125 అడుగుల ధ్యాన బుద్ధ విగ్రహాన్ని, ధ్యానబుద్ధ వనాన్ని తిలకించారు. చికాగో విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఆంద్రుఒవే, జెరూసలెం విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఇగుల్‌తో పాటుగా 30మంది ఇజ్రాయేల్ దేశస్తుల బృందం పాల్గొంది.

చక్రవర్తికి వంశ వైద్య విభూషణ అవార్డు



వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామంలోని సుధాపాణి నర్సింగ్ హోమ్‌కి చెందిన ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ దివి సీతా రామచక్రవర్తికి జాతీయ స్థాయిలో వంశ వైద్య విభూషణ అవార్డు అందుకున్నారు. చెన్నైలోని గ్రీన్ పార్కు హోటల్లో ఈనెల 24వ తేదీన ఆయుర్వేదిక్ వంశ వైద్య 2023 పురస్కారాలు అందజేశారు. రాష్ట్రం నుంచి వంశ పారంపర్య ఆయుర్వేద వైద్య వృత్తిని నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యులకు పురస్కారాలు అందజేశారు. చక్రవర్తికి ఆయుర్వేద వైద్య విభూషణ్ అవార్డు లభించింది. ఆయుర్వేదోద్ధారక పండిత దివి గోపాలాచార్యులు 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వేదిక్ హెల్త్ కేర్ సెగ్మెంట్ చెన్నైలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా పూణే తిలక్ ఆయుర్వేదిక్ కాలేజీ ప్రొఫెసర్ ఆయుర్వేద త్రిఖండ భూషణ్ డాక్టర్ దిలీప్ గార్గిల్, నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ దివి జయశ్రీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

కడలిలోకి ఆలీవ్ రిడ్లే తాబేళ్లు



చినగంజాం: మత్స్యకారుల జీవనోపాధులు పెంచే కార్యక్రమంలో భాగంగా మత్స్యసంపదను వృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆర్.శ్రీదేవి అన్నారు. బాపట్ల డివిజన్ చీరాల రేంజ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కుంకుడు చెట్లపాలెం గ్రామ సముద్రతీరంలో ఆలీవ్ రిడ్లే తాబేళ్లు సముద్రంలోనికి వదలిపెట్టే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా 100 ఆలీవ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదలి పెట్టారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై జాన్సన్, ఎఫ్‌బీఓ నాగమణి, సముద్ర తాబేళ్ల రక్షణ దళం సభ్యులు కారాని శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, శ్రీను, తిరుపతి స్వామి, గ్రామస్తులు, ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, ఎస్వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

మూల విరాట్‌ను తాకిన సూర్యకిరణాలు



జే.పంగులూరు: మండలంలోని చందలూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందినది. దేవాలయం 15వ శతాబ్దంలో కృష్ణదేవరాయులు వంశస్తుడైన అచార్యుల కాలంలో నిర్మితమైనట్లు శాసనాలు చెప్తున్నాయి. ప్రతి ఏడాదీ సౌరమానం ప్రకారం రెండు పర్యాయాలు సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్‌ని తాకుతాయి. అవి ఉత్తరాయణంలో కుంభ సంక్రమణంలో శతభిషం కార్తెలో అనగా ఫిబ్రవరి 27, 28 తేదీల్లో ఉదయం 6.30 నుంచి 6.55 గంటల వరకు, మరోసారి దక్షిణాయణంలో కన్యా సంక్రమణంలోని అస్త కార్తెలో అక్టోబర్ 14, 15 తేదీల్లో ఉదయం 6.05 నుంచి 6.30 గంటల వరకు సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్‌ను తాకుతాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం చందలూరు గ్రామంలోని చెన్నకేశవస్వామివారిని నేరుగా సూర్యకిరణాలు తాకాయి. సోమవారం భక్తులు స్వామివారిని భక్తి శ్రద్ధలతో పూజించారు.

త్రికరణ శుద్ధిగా..

రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతోంది. గతంలో సాగు అంటేనే భయపడాల్సిన దుస్థితిని మార్చి, నాలుగేళ్లుగా పెట్టుబడి సాయం కింద నగదు అందిస్తూ ప్రభుత్వం అన్నదాతల్లో భవిష్యత్తుపై ఆశలు చిగురింపజేసింది. వారిలో భరోసా నింపుతోంది. నేడు మూడో విడత భరోసా సాయం అందిస్తూ రైతుల అభ్యున్నతికి, రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి 'త్రి'కరణ శుద్ధితో పనిచేస్తున్నానని చాటి చెబుతోంది.

నేడు వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ నగదు జమ

- నాలుగో ఏడాది.. మూడో విడత చెల్లింపులు
- జిల్లాలో 2,66,871 మంది రైతుల ఖాతాల్లో రూ.57.69 కోట్లు
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రెండు విడతలుగా ఒక్కో రైతుకు రూ.11,500 చెల్లింపు
- నేడు తెనాలిలో బటన్ నొక్కి విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, నరసరావుపేట: నేల తల్లిని నమ్ముకున్న రైతన్నలకు అండగా నిలిచేందుకు రాష్ట్రప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పేరుతో నగదు సాయం అందిస్తోంది. ఏటా మూడు దఫాలుగా ఆర్థికసాయం చేసి పంటల పెట్టుబడికి తోడుగా నిలుస్తోంది. నేడు రైతుల ఖాతాల్లో వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ మూడో విడత చెల్లింపులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో బటన్ నొక్కి ప్రారంభించనున్నారు. సాగు ఖర్చుల నిమిత్తం రైతులు అప్పులు చేయాల్సిన పని లేకుండా గత నాలుగేళ్లుగా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. దీంతో రైతులు సకాలంలో పంటలు సాగు చేసుకుంటున్నారు. సాగును సంబరంగా చేస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పేరిట ఏటా అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. దీన్ని ఖరీఫ్‌లో పంటసాగు నిమిత్తం మే మాసంలో మొదటి విడతగా రూ.7,500, రెండో విడతగా రబీ నిమిత్తం అక్టోబర్ నెలలో రూ.4,000, మూడో విడతగా రూ.2,000 జనవరిలో ప్రభుత్వం విడుదల చేస్తుంది.

జిల్లాలో 2,66,871 మంది లబ్ధిదారులు...

గత మూడు ఆర్థిక సంవత్సరాలు ఇలానే క్రమం తప్పకుండా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రెండు దఫాలుగా మే 16, అక్టోబర్ 17న రైతుల ఖాతాల్లో నగదు జమైంది. నేడు మూడో విడతలో భాగంగా రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2,000 జమకానుంది. రైతులు ఈకేవైసీ చేసుకోవడంలో జరిగిన ఆలస్యం కారణంగా మూడో విడత నగదు జమలో కొంత జాప్యం జరిగింది. వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకానికి సంబంధించి పల్నాడు జిల్లాలోని 28 మండలాల పరిధిలో మొత్తం 2,66,871 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరి వ్యక్తిగత ఖాతాల్లో నేడు రూ.57,69,49,500 జమ కానుంది. రాష్ట్రస్థాయి కార్యక్రమం తెనాలిలో జరగనుండగా, జిల్లా స్థాయి కార్యక్రమం పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరగనుంది. ఇందులో రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం..



రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాత నిర్ణయాలు తీసుకొని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. రైతులకు అండగా నిలవాలనే ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం అమలు చేస్తోంది. అందులో భాగంగా మూడో విడత నిధులు నేడు జమ కానున్నాయి. అర్హులైన ప్రతి రైతుకు నగదు జమకానుంది. ఎవరికైనా జమకాకపోతే సంబంధిత ఆర్‌బీకేలలో సంప్రదించి లబ్ధిపొందవచ్చు.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

జగనన్న రైతు బాంధవుడు...



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు పెట్టుబడి నిమిత్తం అప్పులు చేయాల్సిన పనిలేకుండా వైఎస్సార్ రైతు భరోసా పేరిట ఏటా రూ.13,500 నగదును మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. విత్తనాలు మొదలు... ధాన్యానికి గిట్టుబాట ధర లభించేవరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అందుకే రైతులందరూ జగనన్నను రైతు బాంధవుడిగా పిలుచుకుంటాం.

– అడపాల అంబారావు, రైతు, ఆత్మకూరు, దుర్గి మండలం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గోపాలకృష్ణ ద్వివేది, హరికిరణ్, కలెక్టర్ , తలశిల, శివకుమార్ తదితరులు

రైతు బాంధవుడి రాకకోసం..

- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- పకడ్బందీగా ఏర్పాట్లు

తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెనాలి-నారాకోడూరు రోడ్డులో గల కవిరాజనగర్‌లో హెలిప్యాడ్ నిర్మాణం పూర్తిచేసి, అక్కడకు దగ్గర్లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్మించిన బహిరంగ సభావేదిక వద్దకు సోమవారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జాయింట్ కలెక్టర్ జీ.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మరోసారి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

- మార్కెట్ యార్డు నుంచి కవిరాజనగర్‌లోని హెలిప్యాడ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బ్యారికేడ్లు నిర్మించారు. ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అనుమతులు లేవు.
- మార్కెట్ యార్డులోని ఇన్‌గేట్ ద్వారా సీఎం కాన్వాయ్ లోపలకు ప్రవేశించి బహిరంగ సభావేదికకు చేరుకుంటుంది. మార్కెట్‌యార్డు ఔట్‌గేట్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో యార్డు లోపలకు తాత్కాలికంగా ఏర్పాటుచేసిన రహదారి, ప్రభుత్వ ఆసుపత్రి పక్కనుంచి ఇప్పటికే ఉన్న రహదారి...అంటే మూడు మార్గాల్నుంచి రైతులు, సాధారణ ప్రజలు, సందర్శకులను అనుమతించనున్నారు.

సీఎం హోదాలో తొలిసారి తెనాలికి..

రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారి తెనాలి రానుండగా ఘనస్వాగతం పలికేందుకు తెనాలి ప్రాంత రైతాంగం, సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉవ్విళ్లూరుతున్నారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో కొల్లిపర జడ్పీటీసీ, ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టీనా, కత్తెర సురేష్‌కుమార్ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బహిరంగ సభ ఏర్పాట్లు...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి పర్యటన సజావుగా కొనసాగేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రైతు భరోసా కేంద్రాల ముఖ్య కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది సూచించారు. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్‌తో కలిసి ముఖ్య కమిషనర్ ద్వివేది సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వచ్చారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జేసీ జీ.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ ఎగ్జిబిషన్, గ్యాలరీ ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో సహా కవిరాజనగర్ లే అవుట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి, తగిన సూచనలు చేశారు.

ఉగాది నాటికి శోభ తేవాలి

మిషన్ శోభకృత్‌పై మండల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్ష

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన మిషన్ శోభకృత్ కార్యక్రమాన్ని జిల్లా అధికారులంతా వచ్చే ఉగాది నాటికి విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి ఆయా మండలాల ప్రత్యేకాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.

- అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పేరుకుపోయిన చెత్త, చెదారం, ప్లాస్టిక్, నిరుపయోగ విద్యుత్ పరికరాలు, పేపర్లు, పుస్తకాలు, చెక్క వస్తువులు, శిథిలావస్థకు చేరిన భవనాలు, నిరుపయోగంగా మారిపోయిన పాత వాహనాల వివరాలను ఆయా మండలాల వారీగా సేకరించారు.
- విద్యాశాఖలో సమయం దాటి పోయిన ప్రశ్న, జవాబు పత్రాలు, పాత పాఠ్య, రాత పుస్తకాలు, ఏళ్ల తరబడి పేరుకు పోయిన రికార్డులు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పేపర్లు, పాత పుస్తకాలు, మాన్యువల్ ప్రకారం గుర్తించి, నిరుపయోగంగా మారిన వాటి జాబితాను తయారుచేసిన విధానాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పేరుకుపోయిన మురుగు, చెత్త, చెదారం, ముళ్లకంచెల నిర్మూలన ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. 15 సంవత్సరాలు పాటు వాడిన పాత వాహనాలు జిల్లాలో ఎన్ని ఉన్నాయో తెలుసుకొని వాటిని జిల్లా రవాణాశాఖ అధికారితో మాట్లాడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయాలన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్

సమస్యల సత్వర పరిష్కారానికే 'స్పందన'

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కారమార్గం చూపాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి 145 అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీలను ఇచ్చేందుకు వచ్చిన ప్రజలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున నరసరావుపేటకు చెందిన జూలకంటి విజయసారథి దంపతులు సుమారు 250 మందికి అన్నదానం చేశారు. దాతలను కలెక్టరేట్ అధికారులు ఘనంగా సత్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నగదు ఆశచూపి మోసంచేస్తున్న కంపెనీలపై చర్యలు : జేసీ

పెద్ద మొత్తంలో నగదు ఆశ చూపి మోసం చేస్తున్న పలు ప్రైవేట్ కంపెనీలపై చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో పిడుగురాళ్లకు చెందిన ఉప్పుతల నాగేంద్రం అనే మహిళ తాను ప్రతి నెల ఓ ప్రైవేటు కంపెనీలో కొంత డబ్బులు దాచుకొంటున్నానని, అయితే గడువు పూర్తయి డబ్బులు తిరిగి ఇచ్చే సమయంలో కంపెనీ ఎత్తివేశారని, తాను మోసపోయానని తన డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. జేసీ మాట్లాడుతూ పేదలకు రెట్టింపు డబ్బులు ఇస్తామని నమ్మబలికి కొందరు మోసగాళ్లు మాయమాటలు చెబుతారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, అన్ని అనుమతులు ఉన్న కంపెనీల్లో డబ్బులు దాచుకోవాలని ప్రజలకు సూచించారు.

పొలం సర్వే చేయడం లేదు..

నాకు గ్రామంలో నా తండ్రి నుంచి వచ్చిన 3.45ఎకరాల పొలం ఉంది. దానిని సర్వే చేయాలని చలానా కట్టాం. గ్రామంలోని రాజకీయ కారణాలతో మండల సర్వేయరు, గ్రామ సర్వేయర్లు సర్వే చేసేందుకు రావట్లేదు. దయచేసి నా పొలం సర్వే చేయించండి.

– శాఖమూరి హనుమాయమ్మ, కారుమంచి, శావల్యాపురం మండలం



సెల్ వల.. విలవిల

- సెల్‌ఫోన్‌తో జరభద్రం గురూ...!
- అపరిచిత నెంబర్ నుంచి వీడియో కాల్ వస్తే ఎత్తకండి
- నగ్న వీడియో కాల్‌తో హనీట్రాప్
- ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులే టార్గెట్
- అధికారిక నంబర్లకే ఫోన్లు

నేడు సెల్‌ఫోనే ప్రపంచం అయిపోయింది. నగదు లావాదేవీల నుంచి అన్నీ ఫోన్‌లోనే నడిచిపోతున్నాయి. సోషల్ మీడియా ఖాతాల ద్వారా మనం అందరికీ పరిచయం అవ్వడమే కాకుండా మోసగాళ్ల చేతుల్లోకి కూడా వెళ్లిపోతున్నాం. మన ఫొటోలను ఉపయోగించుకుని దొంగ అకౌంట్ల ద్వారా డబ్బులు వసూలు చేసుకుంటున్నవారు కొందరైతే, ఆ ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారు మరికొందరు. ఆన్‌లైన్ మోసాలలో బాధితులందరూ ఉన్నత విద్యావంతులు కావడం గమనార్హం.

- సాక్షి ప్రతినిధి, గుంటూరు

ఇంటికి వచ్చి రిలాక్స్ అయ్యి పడుకోవడానికి సిద్ధం అయ్యే సమయంలో వాట్సాప్‌కు ఒక వీడియో కాల్ వస్తుంది. ఎవరా అని మనం అటెండ్ చేస్తే అటువైపు ఉన్నవారు నగ్నంగా ఉంటారు. వారు నగ్నంగా ఉన్నారని మనకు అర్థం అయ్యి కాల్ కట్ చేసేసరికి ఐదు నుంచి పది సెకన్ల సమయం పడుతుంది. మనం కాల్ కట్ చేసిన తర్వాత వేరే నెంబర్ నుంచి వెంటనే వీడియోకాల్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్ వస్తుంది. మీరు న్యూడ్ కాల్ మాట్లాడారు. ఈ ఫొటోలను మీకు సంబంధించిన అన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెడతామంటూ బెదిరింపులకు దిగుతారు. భయపడి లొంగితే ఐదు వందల నుంచి ప్రారంభించి లక్షల రూపాయలు వసూలు చేస్తూనే ఉంటారు. ఈ కాల్స్ అన్ని ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నతాధికారులే టార్గెట్‌గా వస్తున్నాయి. ప్రభుత్వ నెంబర్‌కే ఈ ఫోన్లు వస్తుండటం గమనార్హం. గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ ఇటువంటి ఘటనలు 50కి పైగా నమోదు అయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ న్యూడ్ కాల్స్ బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించకపోవడం, ఫిర్యాదు చేయడానికి ఇష్టపడకపోవడం వల్ల ఇప్పటి వరకూ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. వారికి స్క్రీన్‌షాట్ రాగానే భయంతో డిలీట్ చేసేస్తున్నారు. దీంతో ఫిర్యాదు చేసి వాట్సాప్ బ్లాక్ చేసే అవకాశం కూడా ఉండటం లేదు.

అధికారుల పేరుతో వాట్సాప్ మెసేజ్‌లు



జిల్లాలోని ఉన్నతాధికారులు తమ వాట్సాప్ డీపీగా పెట్టుకున్న ఫొటోనో, లేకపోతే పత్రికల్లో వచ్చిన ఫొటోలనో తీసుకుని మోసగాళ్లు కొత్త మోసాలకు తెరలేపారు. సదరు అధికారి ఫొటోను తమ డీపీకి పెట్టుకుంటారు. జిల్లాస్థాయి అధికారులు గానీ, అదే విభాగానికి చెందిన కింది స్థాయి అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు సంపాదిస్తారు. వారు ఆఫీసుకు బయలుదేరే బిజీలో ఉన్నప్పుడు వారికి సదరు అధికారి డీపీ ఉన్న ఫోన్ నుంచి మెసెజ్ వస్తుంది. ఇది నా వ్యక్తిగత నెంబర్, అర్జెంట్‌గా వేరేవారికి ఇవ్వడానికి గిఫ్ట్‌కార్డులు కావాలి. నాకు పంపండి అంటారు. తమ ఉన్నతాధికారి అడిగారన్న భావనలో వారు వేల రూపాయల ఖర్చుతో ఈ గిఫ్ట్‌కార్డులు కొని పంపుతున్నారు. పంపగానే ఆ మొత్తాన్ని రీడీమ్ చేసుకుని సిమ్ స్విచ్ ఆఫ్ చేసేస్తున్నారు.

నగరంలో ఒక కేసు నమోదు..

ఇటీవల పట్టాభిపురంలో ఒక కేసు నమోదు అయ్యింది. రాష్ట్రానికి చెందిన మ్యాట్రిమోనీ సంస్థ ద్వారా పరిచయం అయిన ఒక వ్యక్తి పెళ్లి అయిన తర్వాత ఉండటానికి ఒక విల్లా కొందామని, పెళ్లి ఖర్చులకి డబ్బుల పేరుతో రూ.25 లక్షల వరకూ వసూలు చేశాడు. మొత్తం డబ్బులు తానే ఇస్తానని, ఒక్కసారిగా అంత మొత్తం బదిలీ చేయాలంటే ట్యాక్స్ పడుతుందంటూ వారిని నమ్మించాడు. అయితే విల్లా కొనడానికి వెళ్లిన సమయంలో ఆ బిల్డర్‌కు అతని వ్యవహారశైలిపై అనుమానం రావడంతో బాధితులకు చెప్పి వారితో ఫిర్యాదు చేయించాడు. దీంతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి డబ్బులు వెనక్కి ఇప్పించడమే కాకుండా రిమాండ్‌కు పంపించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. ఏ విధంగా మోసపోయినా వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే బాధితులకు న్యాయం జరుగుతుంది. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులు అయినా రిమాండ్‌కు పెడుతున్నాం. జరిగిన నేరాలు వెంటనే పోలీసుల దృష్టికి రావడం లేదు. పోలీసులను ఆశ్రయిస్తే ఖచ్చితంగా న్యాయం జరుగుతుంది.

– ఆరిఫ్ హఫీజ్, జిల్లా ఎస్పీ



పెళ్లి పేరుతో మోసాలు....

పెళ్లి పేరుతో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పరిచయం అయ్యి పెళ్లి చేసుకుందామని నమ్మించి మోసం చేస్తున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. విదేశాల్లో ఉన్నానని పరిచయం చేసుకుంటారు. బాగా ఖరీదైన గిఫ్ట్ పంపుతున్నానని నమ్మిస్తారు. తర్వాత ఆ గిఫ్ట్ ఎయిర్‌పోర్టులో ఆగిపోయిందని, దానికి ట్యాక్స్ కట్టాలంటారు. తర్వాత కస్టమ్స్ డ్యూటీ అని, జీఎస్‌టీ అని అవి ఇండియన్ కరెన్సీలో కట్టాలని చెబుతారు. అందులో డాలర్లు ఉన్నాయని, వాటిని మార్చాలనిదానికి కొంత డబ్బులు అవుతాయని పెళ్లి వాళ్ల నుంచి వసూలు చేస్తున్నారు. ఖరీదైన గిఫ్ట్ అన్న ఆశతో ఇవతల వాళ్లు కూడా స్పందిస్తున్నారు. దీని కోసం యూకే, దుబాయ్ నెంబర్లను డార్క్‌వెబ్‌లో కొన్ని ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

డిగ్గర్ కమ్ మినీ క్రేన్ అందజేత

నరసరావుపేట: నవోదయం కార్యక్రమం కింద జగనన్న బడుగు వికాస పథకం కింద 45శాతం సబ్సిడీపై లబ్ధిదారుడికి ప్రభుత్వం మంజూరు చేసిన డిగ్గర్ కమ్ మినీ క్రేన్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో అందజేశారు. గతేడాది అక్టోబర్ 14వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన నవోదయంలో బెల్లంకొండ మండలానికి చెందిన దుగ్గి వంశీకృష్ణ స్వయం ఉపాధి కోసం జగనన్న బడుగు వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్నాడు. సదరు లబ్ధిదారునకు బెల్లంకొండ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సౌజన్యంతో రూ.16లక్షల విలువ చేసే డిగ్గర్ కం మినీక్రేన్ మంజూరైంది. అందులో లబ్ధిదారు వాటా 15శాతం కాగా, 45శాతం సబ్సిడీ లభించింది. ఈ మేరకు కలెక్టర్ శివశంకర్ స్వయంగా వాహనాన్ని నడిపి లబ్ధిదారుడు కృష్ణకు వాహన తాళాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, నవోదయం కన్వీనర్ ఓబుల నాయుడు, నవోదయం కో–ఆర్డినేటర్ సంజీవరావు పాల్గొన్నారు.



డిగ్గర్ కమ్ మినీ క్రేన్ తాళాలను లబ్ధిదారునికి అందజేస్తున్న జిల్లా కలెక్టర్

జాతీయ ఉత్తమ రైతులకు సన్మానం

నరసరావుపేట: జిల్లాలో జాతీయ ఉత్తమ రైతు అవార్డులను పొందిన ఇద్దరు రైతులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్ ఘనంగా సత్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో పమిడిపాడు గ్రామానికి చెందిన రాగిపాటి దావీదు, గుత్తికొండ గ్రామానికి చెందిన పోలేపల్లి సుధాకర్ సత్కారం పొందారు. బెంగళూరుకు చెందిన జాతీయ ఉద్యాన పరిశోధన సంస్థ నూతన రకం మిర్చి వంగడం హైబ్రీడ్ అర్కశాన్వి ప్రవేశపెట్టగా ఈ రైతులు ఆ వంగడాన్ని సాగుచేసి ఎకరాకు 30 క్వింటాళ్ల అధిక దిగుబడి సాధించారు. ఈ రకం వంగడం మిరపలో వచ్చే వైరస్ తెగులు, నల్లతామర పురుగు ఉధృతిని తట్టుకొని ఎక్కువ దిగుబడిని సాధిస్తాయి. వీరు వేసిన పొలాలను జాతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు పరిశీలించి జాతీయ ఉత్తమ రైతులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి బీజే బెన్నీ, పిడుగురాళ్ల, వినుకొండ ఉద్యాన అధికారులు పి.శ్రీనివాసరావు, షేక్ నబీరసూల్ పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నిన్ను చంపైనా సరే ఆస్తి తీసుకుంటాం

- స్పందనలో మనవరాలిపై ఫిర్యాదు చేసిన ఓ 85ఏళ్ల వృద్ధురాలు
- జిల్లా ఎస్పీ స్పందనలో 54 అర్జీలు



చిన్న కూతురు కుమార్తెతో వచ్చిన 85 ఏళ్ల తిరుపతమ్మ

'ఈ ఫొటో‌లో కనిపిస్తోంది కొత్తమాసు తిరుపతమ్మ. 85 ఏళ్లు. రాజుపాలెం మండలం ఇనిమెట్ల. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. భర్త, ఇద్దరు కుమారులు చనిపోయారు. చిన్న కుమార్తె చనిపోతే ఆమె కూతురిని పెంచుకుంటూ సత్తెనపల్లిలో ఉంటోంది. పిడుగురాళ్లలో రూ.2కోట్ల విలువైన రైస్‌మిల్లు స్థలం ఉంది. అయితే అప్పులు కూడా ఉన్నాయి. దానిలో అప్పులతో సంబంధం లేకుండా నాకు రావాల్సిన భాగం నాకు ఇవ్వాలంటూ సత్తెనపల్లిలోనే నివాసం ఉండే పెద్ద కుమార్తె, ఆమె కూతురు వేధిస్తున్నారు'. చంపైనా సరే ఆస్తి తీసుకుంటామంటూ గత మంగళవారం నాపై దాడిచేసి నన్ను గాయపరిచగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే కోర్టులో తేల్చుకోండని సమాధానమిచ్చారని స్పందనలో అర్జీ అందజేసింది.

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి సోమవారం అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాధవ్‌తో కలసి 54 ఫిర్యాదులను స్వీకరించారు. అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ యు.రవిచంద్ర, గురజాల డీఎస్పీ జయరాంప్రసాద్, నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు, సీఐ సుభాషిణి పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీబిందు మాధవ్

మా మనవరాలు, ఆమె భర్త నుంచి రక్షణ కల్పించండి



చిలకలూరిపేట అంబేడ్కర్ కాలనీలో ఇల్లు, యడ్లపాడు మండలం గంటినపాడులో 40సెంట్ల భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం తనకు తెలియకుండా తన భర్తను మోసం చేసి మేము చనిపోయే వరకు తమ సంరక్షణ చూస్తామంటూ నా పెద్దకుమార్తె చిన్న కూతురు ఆస్తి మొత్తం తమ పేరుపై వీలునామా రాయించుకుంది. అప్పటి నుంచి తన భర్త చనిపోయేంత వరకు తమ బాగోగులు పట్టించుకోలేదు. నా భర్త చనిపోయే ముందు ఆ వీలునామా రద్దు చేయించి నాపేరుపై వీలునామా రాశాడు. దాని సహాయంతో ఆస్తిని నాపేరుపై రిజిస్ట్రార్ చేయించుకొని నా సంతానం పేరుపై రిజిస్ట్రార్ చేశాను. ఈవిషయం తెలుసుకున్న నా మనవరాలు, ఆమె భర్త, అతడి తండ్రి నా ఇంటికి వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించి నా ఇంటిలోనేను సురక్షితంగా ఉండేలా చూడాలి.

–కుదారి మరియమ్మ, చిలకలూరిపేట

నా కుమార్తెను విడిపించండి



నా కుమార్తెను 52 ఏళ్ల వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని డ్రగ్స్ అలవాటు చేసి దారితప్పించి తీసుకెళ్లాడు. బీ ఫార్మసీ చదివిన 20 ఏళ్ల కుమార్తెను హైదరాబాద్‌లో వద్దనే ఉంచుకున్నాడు. ఉద్యోగం ఏమి చేయకుండానే నా కుమార్తె డ్రగ్స్‌కు లోనై అతను చెప్పినట్లుగానే వింటూ అతడితో సహజీవనం చేస్తోంది. ఇక్కడి పోలీసులకు నా కుమార్తె కన్పించకుండా పోయినట్లు ఫిర్యాదు చేశాను. నా కుమార్తె ఉంటున్న అడ్రస్సు కనుక్కొని పోలీసులకు తెలియచేసినా పట్టించుకోవట్లేదు. నా కుమార్తెను అతడి నుంచి రక్షించి నాకు అప్పచెప్పాలి.

–షేక్ మస్తాన్‌బీ, అమరావతి

వెదురు బొంగులతో అలంకరణ వస్తువులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఎస్ఆర్, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, ఫైన్‌ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వెదురు బొంగులతో అలంకరణ వస్తువుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉజ్వల హోంలో ఉండే మహిళలు, బాలికల ఉన్నతికి తోడ్పడే శిక్షణ కార్యక్రమాలు, సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎస్ఆర్ కో–ఆర్డినేటర్ ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, ఉజ్వల హోం ప్రతినిధులు సిస్టర్ రోజ్‌లీనా, సిస్టర్ రాణి, సిస్టర్ పునీత, సిస్టర్ రూప తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఉజ్వల హోంలో ఈ శిక్షణ కార్యక్రమం వారం రోజులపాటు కొనసాగనుంది.

ముగిసిన తైక్వాండో పోటీలు



రేపల్లె: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారిచే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కే.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులకు నాలుగు విభాగాలలో పోటీలు నిర్వహించగా పోటీలలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. వీరిలో ప్రథమ స్థానంలో రేపల్లె పట్టణానికి చెందిన కింగ్స్‌వే అకాడమీ క్రీడాకారులు నిలిచారని, వారు 20 బంగారు, 12 రజత, 15 కాంస్య పతకాలను సాధించారని చెప్పారు. చింకపాలెం జెడ్పీహైస్కూలు క్రీడాకారులు 14 బంగారు, 9 రజత, 6 కాంస్య పతకాలు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, తెనాలికి చెందిన సీఎంసీ ఫిట్‌నెస్ జోన్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు 6 బంగారు, 2 రజత పతకాలు సాధించి తృతీయస్థానంలో నిలిచారన్నారు. పోటీలలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు మార్చి 10వ తేదీన విశాఖ పట్నం జిల్లా యలమంచలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొని విజేతలకు పతకాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

యాదవరాజుల సత్రం అభివృద్ధికి చర్యలు

రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని శ్రీ ఆనంద వల్లి యాదవరాజుల అన్నదాన సత్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. అన్నదాన సత్రం మూడో అంతస్తుకు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీద మస్తాన్‌రావు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు కొక్కెర శ్రీనివాసయాదవ్, ఉపాధ్యక్షుడు బూర్ల సాంబశివరావు యాదవ్, కార్యదర్శి గండికోట శ్రీనివాస యాదవ్, కోశాధికారి బొమ్మసాని పిచ్చయ్య యాదవ్, జాయింట్ సెక్రటరీ నంబుల శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.



యాదవ అన్నదాన సత్రం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు

పులిచింతల ప్రాజెక్టులో 42 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ 42.5720 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి 3200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 3000 క్యూసెక్కులు వదులుతున్నారు.

సీఎం జగన్ పాలనలో రైతే రాజు

- రెతన్నకు అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నేడు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న సీఎం జగన్
- ఎంపీ అయోధ్యరామిరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతే రాజు అని, రైతన్నకు అండగా నిలావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్ర ద్వారా రైతాంగ సమస్యలను చూసిన సీఎం జగన్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను పలు దేశాల ప్రశంసాలు అందినట్లు చెప్పారు. రైతన్నకు ఆర్థికంగా బలం చేకూర్చటంతో పాటు, అన్ని విధాలు అండగా ఉండాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని పేర్కొన్నారు.



వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాల జిల్లాల కోఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ మంగళవారం తెనాలిలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. గత టీడీపీ హయాంలో రైతులను నిలువునా వంచించారని, ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. కోటయ్య కమిటీ ద్వారా రైతులకు పరిహారం అందకుండా ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుది అని మండిపడ్డారు. సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టిన తరువాత రైతులకు సబ్సిడీతో పనిముట్లు అందించటంతో పాటు, వారికి ఎటువంటి కష్టం వచ్చినా.. అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయంగా రూ.13,500 పంపిణీ చేస్తున్నారన్నారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా మాట్లాడుతూ ప్రస్తుతం మిరపకాయ క్వింటాలుకు రూ.7వేలు, పసుపు రూ.6,850 మద్దతు ధర ఉందని చెప్పారు. సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కె.సురేష్‌కుమార్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల పాల్గొన్నారు.

కృష్ణా నదిలో దూకి ఓ తల్లి ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: ఓ కన్న తల్లి తన కొడుకు వివాహం చేసుకోవడం లేదని మనస్తాపం చెంది కొడుకుతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. మంగళగిరి మురుగుడు హనుమంతరావు కాలనీకి చెందిన ఆకురాతి వెంకటరమణమ్మ(45) తన చిన్న కుమారుడు లక్ష్మణ్ వివాహం చేసుకోవడం లేదని మనస్తాపం చెంది కొడుకుతో గొడవపడి ఇంట్లో నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయటకు వెళ్లింది. అప్పటి నుంచి పెద్ద కొడుకు రాము, చిన్న కుమారుడు లక్ష్మణ్ బంధువుల ఇళ్లలోను, ఇతర ప్రాంతాల్లో ఎంక్వయిరీ చేశారు. ఎటువంటి సమాచారం లభించలేదు. సోమవారం ఉదయం కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్ల సమీపంలో రైల్వే బ్రిడ్జి కింద మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి సమాచారం కోసం మహిళా పోలీసుల గ్రూపులో వెంకటరమణమ్మ మృతదేహం ఫొటోను పోస్ట్ చేశారు. మంగళగిరి మహిళా పోలీసులు వెంకటరమణమ్మగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీవారి కల్యాణానికి దేవతలకు ఆహ్వానం

వైభవంగా గరుత్మంతుని ధ్వజారోహణం

మంగళగిరి: స్థానిక లక్ష్మీ నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అతిప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఋత్విగరణ, అంకురారోపణాధి కార్యక్రమం నిర్వహించి స్వామి వారి కల్యాణోత్సవానికి భక్త జనులను, దేవతలను ఆహ్వానించేందుకై భక్తాగ్రేసరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్ఠించారు. స్వామి వారి సేవలకు, భక్తజన సేవలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కలుగజేసేందుకు దేవతలందరిని వారి వారి విధుల్లో నియమించేందుకు గరుత్మంతుడు ఆహ్వానం పలకడానికి సన్నద్ధమయ్యాడు. అష్ట నాగాధిపతి అయిన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దలు అనే పేరుతో పంపిణీ చేశారు. గరుడ ముద్దలు ప్రసాదంగా తీసుకుంటే సంతానం లేని దంపతులు సంతాన వంతులు కాగలరని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భారీగా తరలివచ్చిన భక్తులు గరుడ ముద్దల ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు వ్యవహరించగా, ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు హనుమంత వాహనంపై నారసింహుడు...

నృసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7 గంటలకు స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ రామకోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి ఆశీర్వాదాలు పొందాలని ఆయన కోరారు.



పూజలకు హాజరైన భక్తులు

బాలిక కిడ్నాప్ కేసులో ఐదేళ్ల జైలు

- వెయ్యి జరిమానా
- తీర్పునిచ్చిన జిల్లా పోక్సో కోర్టు జడ్జి రామకృష్ణారావు

నాదెండ్ల: బాలికను కిడ్నాప్ చేసి, అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి పోక్సో చట్టం కింద ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. ఎస్ఐ అవుల భాస్కర్ తెలిపిన వివరాలు... పానుగుపాడు గ్రామానికి చెందిన జక్కుల అనిల్‌కుమార్ పాస్టర్‌గా వ్యవహరిస్తూ చర్చిని నడుపుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక అతడి చర్చికి వెళ్తుండేది. అయితే బాలికతో అనిల్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలియడంతో బాలికను ఆమె తండ్రి తూబాడు గ్రామంలోని ఆమె అమ్మమ్మ ఇంటికి పంపాడు. తూబాడు గ్రామంలో బాలిక ఉందని తెలుసుకున్న అనిల్‌కుమార్ 2017, జూలై 23న కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక జాడ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు అనిల్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపారు. పల్నాడు జిల్లా పోక్సో కోర్టు జడ్జి రామకృష్ణారావు సోమవారం నిందితుడికి పై శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రస్తుత సీఐ వై.అచ్చయ్య, ఎస్ఐ ఎ.భాస్కర్‌లు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి కేసు విచారణ వేగంగా పూర్తయ్యేందుకు సహకరించారు.

దేశాన్ని శక్తిమంతం చేయాలంటే యువశక్తితోనే సాధ్యం

చేబ్రోలు: దేశాన్ని అభివృద్ధితో పాటు, శక్తిమంతంగా తయారు చేయాలంటే యువశక్తితోనే సాధ్యమని చెన్నైలోని ప్రొపెల్లర్ టెక్నాలజీస్ ఫౌండర్ సీఈఓ, జఫీ రోబోట్స్ కో–ఫౌండర్ ఆషిక్ రహమాన్ అన్నా రు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇట్స్ మై స్టోరీ' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ముఖ్య అతిథిగా హాజరైన ఆషిక్ రహమాన్ మాట్లాడారు. కోవిడ్–19 మొదటి వేవ్ సమయంలో కరోనా బాధితులకు సేవలందించేందుకు 100 రోబోలను తయారు చేసి తమిళనాడు ప్రభుత్వానికి అందజేసినట్లు వివరించారు.

కలప లోడు లారీ పల్టీ

తప్పిన పెనుప్రమాదం

యడ్లపాడు: కలప లోడు లారీ పల్టీకొట్టింది. పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన హైవేపై సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా దోబిచర్ల నుంచి ప్రకాశం జిల్లా ఒంగోలుకు టేకు దుంగల లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. లారీ యడ్లపాడు మైదవోలు వెళ్లే అండర్‌పాస్ హైవే వంతెనపై వచ్చేసరికి లారీ ముందుటైరు పంక్చర్ అయింది. వేగంలో ఉన్న లారీ ఒక్కసారిగా కుదుపునకు గురై అదుపు తప్పింది. దీంతో లారీ ఓ వైపునకు వాలడంతో బరువెక్కువై దుంగలన్నీ మోకుల నుంచి జారి హైవేపై పడ్డాయి. ఈ క్రమంలో వంతెన సైడ్ డివైడర్ పక్కనే పడిపోవడంతో లారీపై ఉన్న దుంగలు కొన్ని వంతెనపై నుంచి కింది భాగంలో ఉన్న గ్రామంలోని సర్వీసు మార్గంలోకి వచ్చి పడ్డాయి. విద్యుత్తు స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తెగిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారు.



యడ్లపాడు హైవే వంతెనపై పడిన కలప లోడు లారీ

హైటెక్ పాదయాత్రలతో లోకేష్ అభాసుపాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: హైటెక్ పాదయాత్రలు చేస్తూ అభాసు పాలవుతున్న లోకేష్ సభ్యత, సంస్కారం మరచి తనకు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని బేతపూడిలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బైక్‌లపై పర్యటించటం పాదయాత్ర ఎలా అవుతుందో లోకేష్ చెప్పాలన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకోకుండా ప్రభుత్వాన్ని విమర్శించటమే ధ్యేయంగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నవరత్న పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే చంద్రబాబు, లోకేష్ ఓర్వలేకపోతున్నారని అన్నారు. పేదలకు సాయం చేయాలన్న ఆలోచన సీఎం జగనన్నదైతే దానిని అడ్డుకోవాలన్న ఆలోచన చంద్రబాబుదన్నారు. రాష్ట్రంలో పథకాలు అమలవటం లేదని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించటం లేదని లోకేష్ పదేపదే ప్రస్తావించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సచివాలయాల ద్వారా 2లక్షల మందికి పైగా శాశ్వత ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పలు కార్పొరేట్ సంస్థల ద్వారా రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇవేవి లోకేష్‌కు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలులాగా కనబడటం లేదా అని ప్రశ్నించారు? రాష్ట్రంలో ఉనికిని కోల్పోతున్న తెలుగుదేశం పార్టీని చంద్రబాబు, లోకేష్‌లను ఎల్లోమీడియా ఎంతో హైలెట్ చేయాలని ప్రయత్నిస్తున్నా ఉపయోగం ఉండటం లేదన్నారు. లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసినా చంద్రబాబునాయుడు ఎన్ని సభలు నిర్వహించినా రాష్ట్ర ప్రజలు వారిని నమ్మే పరిస్థితిలేదన్నారు. 2024లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా లక్ష్మి పాల్గొన్నారు.